క్లుప్తంగా

జీఎస్టీ తగ్గింపుతో ఎంతో మేలు



గోపాలపట్నంలో ర్యాలీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు

గోపాలపట్నం: జీఎస్టీ తగ్గింపుపై రవాణా శాఖ, పర్యాటక శాఖ, ట్రాఫిక్ పోలీసులు గురువారం గోపాలపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. నిత్యావసర వస్తువులపై భారీగా పన్ను తగ్గిందన్నారు. విశాఖ పర్యాటక నగరం కావడంతో ఇక్కడికి వచ్చేవారికి, స్థానికులకు జీఎస్టీ భారం తగ్గిందని వివరించారు. గోపాలపట్నం బంక్ నుంచి గోపాలపట్నం జంక్షన్ వరకు ర్యాలీ చేశారు.

యువకుడి ఆత్మహత్య



డొప్ప గాంధి మృతదేహం

గోపాలపట్నం: ఉరి వేసుకుని ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుచ్చిరాజుపాలెంలో జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. డొప్ప గాంధి(26) అనే యువకుడు బుచ్చిరాజుపాలెంలోని హిమాలయా షాప్‌పై మూడో అంతస్తులో హ్యాపీహోమ్స్ ఫొటో ఫ్రేమ్స్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతడి కుటుంబ సభ్యులు సూర్యానగర్–2లో నివసిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్లి వచ్చిన అనంతరం యువకుడు తన షాపులో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అదే రోజు సాయంత్రం 6, 7 గంటల సమయంలో షాపు వద్దకు వచ్చిన అతడి స్నేహితులు గాంధి ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి వెంటనే ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారమందించారు. వారు ఘటన స్థలానికి వచ్చి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. 6 నెలల కిందట స్నేహితులతో కలిసి గాంధి బుచ్చిరాజుపాలెంలో షాపు ఏర్పాటు చేశాడు. స్థిరపడుతున్నారన్న సమయంలో ఆ యువకుడు ఆత్మహత్యకు పాల్పడటంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోయారు. కుటుంబానికి ఆసరాగా ఉంటున్న పెద్ద కొడుకు లేకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. మృతుడి తండ్రి ఉపేంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో ఏఎస్ఐ రామన్న దొర కేసు దర్యాప్తు చేపట్టారు.

ఐదేళ్ల తర్వాత ఇంటికి చేరిన డ్రైవర్



కుటుంబ సభ్యులతో సమీర్

దాబాగార్డెన్స్: ఒడిశాలోని కాందమల్ జిల్లా గిరుటి గ్రామానికి చెందిన సమీర్ మానసిక వ్యాధికి గురయ్యాడు. అంతకు ముందు సొంత ట్రక్కు నడుపుతూ కుటుంబాన్ని చక్కగా పోషించుకునేవాడు. మద్యం, టొబాకోకు బానిసయ్యాడు. ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నమై అప్పుల పాలయ్యాడు. ట్రక్కు అమ్మేశాడు. ఒత్తిడికి లోనై మానసిక అనారోగ్యానికి గురయ్యాడు. తల్లి, భార్య, ఏడాది కుమారుడిని వదిలి ఐదేళ్లుగా ఇళ్లు విడిచి తిరుగుతున్నాడు. గత ఏడాది అక్టోబర్‌లో ఏయూటీడీ సిబ్బంది సమీర్‌ను రెస్క్యూ చేసి షెల్టర్‌కు తరలించారు. శ్రద్ధా ఫౌండేషన్ మందులతో తొందరగా కోలుకోవడంతో వైజాగ్ నుంచి నేరుగా ఒడిశా తీసుకెళ్లి తల్లి, భార్యకు క్షేమంగా అప్పగించారు.

కూలీ రేట్లు పెంచాలని ప్లైవుడ్ కార్మికుల నిరసన

సీతంపేట: ప్లైవుడ్ కార్మికులకు కూలీ రేట్లు పెంచాలని సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు అన్నారు. కార్మికులతో కలిసి గురువారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ప్లైవుడ్ కార్మికులకు కూలీ రేట్లు పెంచలేదని, నిత్యావసర సరకుల ధరలు, ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగాయని, స్కూల్ ఫీజులు, రవాణా చార్జీలు పెరిగిపోవడంతో ఆర్థిక భారం పడుతోందన్నారు. డీసీఎల్ యాజమాన్యంతో మాట్లాడి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, కార్మికుల కూలీ రేట్లు తక్షణమే పెంచేలా చర్యలు చేపట్టాలని కోరారు.

స్ఫూర్తి ప్రదాతలపై ఇంత నిర్లక్ష్యమా..!

- హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్ వద్ద తుప్పల్లో మహనీయుల విగ్రహాలు
- వీటి దుస్థితిని పట్టించుకునే నాథుడు కరవు
- అధికారులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యుల తీరుపై విమర్శలు



తుప్పల మాటున విగ్రహాల దుస్థితి



హెచ్‌సీ వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ వద్ద పిచ్చిమొక్కల మధ్యలో స్ఫూర్తి ప్రదాతల విగ్రహాలు

గోపాలపట్నం: పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు దేశ నాయకులు, స్ఫూర్తి ప్రదాతల జీవిత చరిత్రలను పాఠ్యాంశాలుగా బోధిస్తుంటారు. మహనీయుల జీవితాలు మనకు ఆదర్శమంటూ వల్లె వేస్తుంటారు. విద్యార్థులకు ఆదర్శనీయులుగా ఉండేందుకు పాఠశాల ఆవరణలో వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. కాలక్రమంలో వాటి గురించి పట్టించుకునే వారే ఉండరు. మహనీయుల గురించి చెప్పే బోధనలు పుస్తకాలకే పరిమితమవుతాయి. విగ్రహాల రంగులు పోతున్నా.. పిచ్చిమొక్కలు, తుప్పలు చుట్టుముట్టేస్తున్నా.. వాటి చుట్టూ పరిసరాలు అధ్వానంగా తయారైనా.. పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం. జీవీఎంసీ 92వ వార్డు హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన స్ఫూర్తి ప్రదాల విగ్రహాల పరిస్థితి ఇలాంటిదే. ఇవి నిర్లక్ష్యానికి గురై పిచ్చిమొక్కల మాటున దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ప్రతి రోజూ పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయులు గానీ.. ప్రస్తుత స్కూల్ కమిటీ సభ్యులు, విద్యా శాఖాధికారులు గానీ వీటి దుస్థితిని పట్టించుకోవడం లేదు. ఈ విగ్రహాల పరిస్థితిని చూసేవారు.. మహనీయుల విషయంలో పాలకులు, అధికారులు, ఉపాధ్యాయులకు ఇంత నిర్లక్ష్యమా అంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

స్కూల్ కమిటీ పట్టించుకోవాలి

గొప్పవారి విగ్రహాలను నిర్లక్ష్యంగా వదిలేయడం సరికాదని, వీటి గురించి పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బాధ్యతగా భావించాలని సూచిస్తున్నారు. ఇందులో విద్యార్థుల తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించాలంటున్నారు.

గత ప్రభుత్వంలో విగ్రహాల ఏర్పాటు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్ ప్రవేశ గేటు వద్ద ప్రహరీకి ఇరువైపులా అప్పటి స్కూల్ కమిటీ సభ్యులు దాతల ద్వారా సేకరించిన మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, అల్లూరి సీతారామరాజు, స్వామి వివేకానంద, మదర్ థెరిసా, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలను ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల వరకు ఇవి బాగానే ఉన్నాయి. ఆ తరువాత వీటి గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రస్తుతం ఈ విగ్రహాలు పిచ్చిమొక్కల మధ్యలో చిక్కుకుని దయనీయ స్థితిలో దర్శనమిస్తున్నాయి.



హైస్కూల్ ప్రహరీకి ఆనుకుని ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల వద్ద పిచ్చిమొక్కలు

ఉద్యానవనంగా తీర్చిదిద్దాలి

పాఠశాల వద్ద విగ్రహాలు ఉన్న ప్రాంతంలోని పిచ్చి మొక్కలను తొలగించి ఉద్యానవనంగా అభివృద్ధి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. అందమైన పూల మొక్కలు, గడ్డి మొక్కలు పెంచాలని, జీవీఎంసీ హార్టీ కల్చర్ సహకారంతో ఉద్యానవనాన్ని రూపొందించాలని, ఇందుకు అధికారులు, స్థానిక నాయకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చర్యల వల్ల పాఠశాల రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

24, 25 తేదీల్లో యువజనోత్సవాలు



బ్యానర్ ఆవిష్కరణలో పాల్గొన్న ప్రిన్సిపాల్ షైజీ, నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఈ నెల 24, 25 తేదీల్లో ఎక్సెల్సియర్–25 యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. కళాశాల ఆవరణలో గురువారం ఎక్సెల్సియర్ పోస్టర్, బ్యానర్లను ఆవిష్కరించారు. ఏయూ పరిధిలోని కళాశాలల విద్యార్థులు రెండు రోజుల పాటు జరిగే యువజనోత్సవాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కో–ఆర్డినేటర్ డాక్టర్ సుధ కోరారు. 2016 నుంచి కళాశాల నిర్వహిస్తున్న వార్షిక విద్యార్థి ఉత్సవాల్లో ఇది భాగమని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన, తెలివైన విద్యార్థులు చదువుల్లో ముందుండాలనే ఆశయంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 3 వేల మంది విద్యార్థులు వేడుకలకు హాజరవుతారని కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.కె.జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ఎక్సెల్సియర్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ సుజాత, సోనీ, ప్రవీణ్, డాక్టర్ కోటేశ్వరరావు, సిస్టర్ దీపాలి, ఊర్మిళ, ప్రత్యూష్, జయలక్ష్మి, స్టూడెంట్ కౌన్సిల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'కోటి సంతకాల సేకరణ' కరపత్రం ఆవిష్కరణ



ప్రజా ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పిన్నింటి అప్పలరాజు, నాయకులు, కార్యకర్తలు



కోటి సంతకాల సేకరణలో పాల్గొన్న పిలక రామ్మోహనరెడ్డి, పార్టీ నాయకులు

కంచరపాలెం: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' కరపత్రాన్ని 57వ వార్డు మర్రిపాలెం పరిధి శ్యామ్‌నగర్ వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సూచనల మేరకు చేపడుతున్న కార్యక్రమాన్ని కార్యకర్తలందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ అంశంపై వార్డు ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. అట్టడుగున ఉన్న పేద విద్యార్థులకు ఉచితంగా వైద్య విద్యను అందించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం పీపీపీ ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. పేదలకు వైద్యవిద్యను, వైద్యాన్ని దూరం చేసే ప్రైవేటీకరణపై సమష్టిగా ఉద్యమిద్దామన్నారు. అనంతరం కార్యకర్తలకు కరపత్రాలు అందజేశారు.

61వ వార్డులో కోటి సంతకాల సేకరణ

మల్కాపురం: కూటమి ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని గురువారం 61వ వార్డు మల్కాపురంలో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పిలక రామ్మోహనరెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించి, స్థానికుల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన 17 వైద్య కళాశాలలను ప్రైవేటీకరించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భోగవిల్లి నాగభూషణం, గోపి, నేల అప్పారావు, నూకరాజు, ఎన్వీ రమణ, శంకరరావు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు



టెన్త్ విద్యార్థి ఇంట్లో ఎంఈవోలు దివాకర్, సోమేశ్వరరావు, హెచ్‌ఎం వేణుగోపాల్

గోపాలపట్నం: పదో తరగతి విద్యార్థులు ఏవిధంగా చదువుతున్నారు, ఇంటి వద్ద వారి స్థితి, పాఠశాలలో ప్రవర్తన వంటి అంశాలపై తల్లిదండ్రులతో చర్చించేందుకు గురువారం సాయంత్రం గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ సందర్శన కార్యక్రమం చేపట్టారు. ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్, హెచ్‌ఎం వేణుగోపాల్, ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువు అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధించాలంటే ఏవిధంగా చదవాలి, అందుకు తల్లిదండ్రులు తీసుకోవలసి బాధ్యతల గురించి వివరించారు. పాఠశాలలో విద్యార్థి ప్రవర్తన గురించి తల్లిదండ్రులతో చర్చించారు. ప్రతి రోజూ విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారా, తల్లిదండ్రులు పంపిస్తున్నారా లేదా ఇంటి వద్ద బయలుదేరి మధ్యలో డుమ్మా కొడుతున్నారా అనే వాటిపై ప్రత్యేక దృష్టి సారించామని హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు. ఈ పర్యటనలు కొనసాగుతాయని, కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా పాల్గొన్నారని చెప్పారు.



విద్యార్థి జెస్సీ ప్రగతి గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్న హెచ్‌ఎం రాజ్యలక్ష్మి

ఆర్పీ పేట హైస్కూల్ ఉపాధ్యాయుల గ్రామ సందర్శన

కంచరపాలెం: విద్యార్థులు టెన్త్‌లో మంచిమార్కులతో ఉత్తీర్ణత సాధించేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులు కోరారు. 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మి నేతృత్వంలో గురువారం గ్రామసందర్శన నిర్వహించారు. టెన్త్ వార్షిక పరీక్షలకు తర్ఫీదుపై అవగాహనకు ఎంఈవో–2 దివాకర్ ఆదేశాల మేరకు గొల్ల కంచరపాలెం, గాంధీనగర్, ఆర్పీ పేట, తోటవీధి, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లోని విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, సబ్జెక్ట్ ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతి, క్రమశిక్షణ తదితర వివరాలను తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ఎల్.చైతన్య, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, నాగేశ్వరరావు, వెంకటరమణ, జె.వి.వసంతకుమారి, సీహెచ్ చుక్కబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



స్పెన్సర్స్ జంక్షన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఆదేశాలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

దాబాగార్డెన్స్: రోడ్ల పైన, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేసి, నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్–3, జోన్–4 పరిధి 17, 20, 22, 29 వార్డుల్లో పారిశుధ్యం, పరిశుభ్రత పనులను కమిషనర్ పరిశీలించారు. జోన్–3 మద్దిలపాలెం జంక్షన్ నుంచి స్పెన్సర్స్ జంక్షన్ వరకు రోడ్డుకిరువైపులా పరిశుభ్రత పనులను పరిశీలిస్తూ, స్పెన్సర్స్ జంక్షన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయినట్టు గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటన చెత్త తొలగించి, బాధ్యులైన దుకాణ యజమానులపై జరిమానా విధించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. శుభ్రత పాటించకపోవడం, దుకాణం ముందు చెత్త బుట్టలు పెట్టకపోవడంపై ఆయన దుకాణ యజమానిని ప్రశ్నించారు. ఇలాంటి నిర్లక్ష్యం మరలా గనుక జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 17, 20 వార్డుల పర్యటనలో భాగంగా పెదవాల్తేర్ గాంధీ సెంటర్ వద్ద రోడ్డు పక్కన కూరగాయల చెత్త వేస్తూ, పశువులకు ఆహారం పెడుతున్న వ్యక్తిని గమనించిన కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే ఆ చెత్త తొలగించి ప్రదేశాన్ని శుభ్రపరచాలని ఆదేశించారు. నివాసితులు, వ్యాపారులు తమ చెత్తను క్లాప్ వాహనాలకు మాత్రమే అందజేయాలని, వాడి పారేసిన కప్పులు, ఇతర వ్యర్థాలు రోడ్లపై వేయరాదని సూచించారు. జోన్–4 పరిధి 29వ వార్డు దండుబజార్ వద్ద జీవీఎంసీ వార్డు కార్యాలయాన్ని సందర్శించి, పారిశుధ్య సిబ్బంది హాజరు పరిశీలించారు. సిబ్బంది బాధ్యతగా తమ పనులు నిర్వర్తించి నగర పరిశుభ్రతకు సహకరించాలని సూచించారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో కార్తీక మాసోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి నవంబర్ 20 వరకు ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ ఉదయం ప్రత్యేక పూజలతోపాటు సాయంత్రం 6 గంటలకు, శనివారం సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన జరుగుతుందని పేర్కొన్నారు. కార్తీక ఆకాశ దీపారాధన నెల రోజులకు రూ.200 రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. నవంబర్ 1న ఏకాదశి ఉదయం 9 గంటలకు శ్రీవారికి తులసీ దళాలతో అర్చన, 5న కార్తీమ పౌర్ణమి సందర్భంగా స్వామికి పంచామృతాభిషేకం, 15న సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తామని చెప్పారు. సత్యనారాయణ వ్రతంలో పాల్గొనాల్సిన వారు రూ.500 రుసుము చెల్లించాలన్నారు.

మర్రిపాలెం రైల్వేస్టేషన్‌లో 4 కిలోల గంజాయి స్వాధీనం



ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులో గంజాయి రవాణాదారులు

తాటిచెట్లపాలెం: మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. గురువారం ఉదయం మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లోని పలు రైళ్లలో రైల్వే భద్రతా దళం సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కర్ణాటకకు చెందిన సలీం పాషా, అమ్ముకుట్టి, నిషాదేవిలు కర్ణాటకకు అక్రమంగా గంజాయిని రవాణా చేయడం గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.20 వేల విలువైన 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం వీరిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించినట్లు మర్రిపాలెం ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వకర్మ అన్నసమారాధన సత్రం ఏర్పాటుకు వినతి

దాబాగార్డెన్స్: సింహాచలం వరాహ నరసింహస్వామి దేవస్థానంపై విశ్వకర్మ (విశ్వబ్రాహ్మణ) అన్నసమారాధన సత్రం ఏర్పాటుకు ఆలయ పరిసర ప్రాంతంలో కొంత స్థలం కేటాయించాలని విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం దేవదాయ శాఖ ఉప కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో శ్రీశైలం మహా పుణ్యక్షేత్రంలో అన్నసమారాధన సత్రం నిర్మించారని, అదే విధంగా విశాఖలో సింహాచలం కొండపై సత్రం నిర్మించి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశీర్వాదంతో అప్పన్న స్వామి భక్తులకు సేవ చేయాలని తీర్మానించామని, సత్రం కోసం కొంత స్థలం కేటాయిస్తే జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం తరఫున సొంత నిధులతో భవన నిర్మాణం చేపట్టి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఆ వినతిలో పేర్కొన్నారు. ఉప కమిషనర్‌ను కలిసిన వారిలో విశ్వబ్రాహ్మణ సాధికారత కమిటీ కన్వీనర్, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోడి నరసింహాచారి, సంఘం అధ్యక్షుడు శివకోటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గిడిజాల పార్వతీశం, వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాయల లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీలు బంగారు సురేష్, గుత్తికొండ గంగాధర్, శ్రీమంతుల వీరాచారి, గోలి వీరభద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ జోన్–6, జోన్–8 అధికారులతో గోపాలపట్నంలోని క్యాంప్ ఆఫీస్‌లో గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో వార్డు స్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని సూచించారు. డ్రెయిన్లు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, యూజీడీ లైన్లు, వాటర్ సప్లై పనులు, విద్యుత్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్‌లో ఈ గ్రౌండ్‌లో రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు, 5కే రన్ నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు శంకరరావు, రాము, ఎస్ఈ కె.శ్రీనివాస్, ఈఈలు సంతోషి, దిలీప్, ప్రసన్న డీఈ వీరన్న, కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ, గల్లా చిన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ



రైతుబజారులో నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న సీఐ చంద్రమౌళేశ్వరరావు

గోపాలపట్నం: నేరాల నియంత్రణకు ప్రజలందరి సహకారం అవసరమని వెస్ట్ సబ్ డివిజన్ సీఐ మీసాల చంద్రమౌళేశ్వరరావు అన్నారు. గోపాలపట్నం రైతుబజారులో గురువారం నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రద్దీగా ఉండే ప్రాంతాలే దొంగతనాలకు అనుకూలమన్నారు. అలాంటి సమయాల్లో ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మనీ పర్సులు, సెల్‌ఫోన్లు, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. రైతుబజార్లలో ఎక్కువగా ఉండే దుకాణాల వద్ద చుట్టూ ఉన్న వారిపై దృష్టి పెట్టాలన్నారు. ఏమరుపాటుగా ఉంటే దొంగలు చాకచక్యాన్ని ప్రదర్శించి, మన దృష్టిని మళ్లించి వారి పని చేసుకుపోతారని వివరించారు. చోరీ చేసిన వాడు ఒకడైతే ఆ వస్తువును తీసుకుపోయేవాడు మరొకరన్నారు. వీరితో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటి వల్ల దొంగతనాలు చాలా మేరకు తగ్గుతాయని, చోరీ జరిగినా వెంటనే దొంగలను గుర్తించే వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో గోపాలపట్నం ఎస్ఐ జి.తేజేశ్వరరావు, రైతుబజారు ఈవో ప్రసాద్, సహాయకుడు శివ శ్రీనాథ్, క్రైం ఏఎస్ఐ గోవిందమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల్లో నిబంధనలు పాటించాల్సిందే..



కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో బాణసంచా దుకాణాల ఏర్పాటును పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కూడలి వద్ద ఏర్పాటు చేస్తున్న బాణసంచా దుకాణాలను గురువారం కంచరపాలెం సీఐ రవికుమార్, ట్రాఫిక్ ఎస్ఐ దాశరధి సందర్శించారు. అగ్నిమాపక శాఖ, జీవీఎంసీ, రాష్ట్ర పన్నుల శాఖ అనుమతులకు లోబడి దుకాణదారులు వ్యాపారాలు చేయాలని వారు సూచించారు. ఆయా శాఖల అనుమతుల పత్రాలను పరిశీలించారు. దీపావళి స్టాళ్ల నిర్వాహకులు కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. స్టాళ్ల మధ్య నిర్ణీత దూరం ఉండాలని, దుకాణాల వద్ద నీరు, ఇసుక సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపారాలు సాగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అట్రాసిటీ కేసుల పెరుగుదల



మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో అట్రాసిటీ కేసులు పెరుగుతున్నా.. కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ఆరోపించారు. ప్రభుత్వ రంగం–సామాజిక న్యాయం పేరిట గురువారం సిటు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలపై నానాటికీ దౌర్జన్యాలు, లైంగిక దాడులు, గ్రామ బహిష్కరణలు యథేచ్ఛగా జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మంత్రుల నియోజకవర్గాల్లో అట్రాసిటీ కేసులు నమోదవుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ రంగంలో ఒక్క పరిశ్రమ కూడా నిర్మించకపోగా ఉన్న శాశ్వత ఉద్యోగాలు తొలగించడం, బీజేపీ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లయినా ఒక్క రిక్రూట్‌మెంట్ కూడా జరగలేదన్నారు. రిజర్వేషన్లు ఒక్క ప్రభుత్వ రంగంలోనే ఉన్నాయని, ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటూనే ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం కృషి చేసినప్పుడే సామాజిక న్యాయం అమలవుతుందని చెప్పారు. సిటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ సామాజిక న్యాయం ఒక్క ప్రభుత్వ రంగంతోనే సాధ్యమవుతుందని, ప్రైవేట్ కంపెనీలు వారి లాభాల పైనే దృష్టి పెడతారన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.